# 55

# సరియైన మరియు తప్పుడు ఆచారానుసరణములు

## (యెషయా 58)

1:10-20 వచనాల్లో అంగీకారయోగ్యముకాని ఆరాధనకు వ్యతిరేకంగా యెషయా ప్రకటించిన హెచ్చరికను 58వ అధ్యాయం మనకు గుర్తుచేయుచున్నది. యూదుల మతము మనఃపూర్వకమైన హృదయములతో కూడినది కానందువలన అది నిరర్థకమైనదనియు, దేవుని సంతుష్టిపర్చుటకు చిత్తశుద్ధిలేని ఆచారానుసరణమనియు ఆయన బట్టబయలు చేసాడు. దేవునితో సత్సంబంధము కలిగియున్నవాడు అదే సమయంలో వాని చుట్టూర నున్న ఇతరులతో కూడ సత్సంబంధము కలిగియుండవలెననునది బైబిలు సంబంధమైన విశ్వాసము యొక్క ఒక విశిష్టమైన లక్షణమై యున్నది.

### ఉపవాసము (58:1-5)

తాళక బూర ఊదినట్లు ఎలుగెత్తి బిగ్గరగా కేకలువేయుము
వారు చేసిన తిరుగుబాటును నా జనులకు తెలియజేయుము
యాకోబు ఇంటివారికి వారి పాపములను తెలియజేయుము
తమ దేవుని న్యాయవిధిని విడువక
నీతిని అనుసరించువారైనట్టు
అనుదినము వారు నాయొద్ద విచారణచేయుచు
నా మార్గములను తెలిసికొనన నిచ్ఛ కనుపరచుదురు
తమకు న్యాయమైన తీర్పులు తీర్చవలెనని వారడుగుదురు
దేవుడు తమకు ప్రత్యక్షుడు కావలెనని యిచ్ఛయింతురు.
మేము ఉపవాసముండగా నీవెందుకు చూడవు?
మేము మా ప్రాణములను ఆయాసపరచుకొనగా
నీవెందుకు లక్ష్యపెట్టవు? అని అందురు
మీ ఉపవాసదినమున మీరు మీ వ్యాపారము చేయుదురు.
మీ పనివారిచేత కఠినమైనపని చేయించుదురు
మీరు కలహపడుచు వివాదము చేయుచు అన్యాయముగా
    గుద్దులాడుచు ఉపవాసముందురు
మీ కంఠధ్వని పరమున వినబడునట్లుగా మీరిప్పుడు
    ఉపవాసముందరు.
అట్టి ఉపవాసము నాకనుకూలమా?
మనుష్యుడు తన ప్రాణమును బాధపరచుకొనవలసిన
    దినము అట్టిదేనా?
ఒకడు జమ్మువలె తలవంచుకొని గోనెపట్ట కట్టుకొని
    బూడిదె పరచుకొని కూర్చుండుట ఉపవాసమా?

అట్టి ఉపవాసము యెహోవాకు ప్రీతికరమని మీరనుకొందురా?

పరిస్థితి యొక్క గంభీరత దేవుడు ప్రవక్తకు సెలవిచ్చిన ఆజ్ఞలలో అగుపడుచున్నది. "తాళక, ఎలుగెత్తి బిగ్గరగా కేకలు వేయవలెన"ని యెషయా ప్రేరేపింపబడినాడు (వచనం 1). ప్రజల హృదయాల్లో పశ్చాత్తాపమునకు దోహదపడు పాపమును గూర్చిన ఒప్పింపును కలుగజేయవలెననునది యెషయా ప్రవక్త ప్రబోధించుటకు గల హేతువై యుండెను. పొట్టేలు కొమ్ముతో చేయబడి, సంగీత సాధనమైయుండిన ఒక "బూర" (*shophar*) వలె ఆయన తన స్వరమును ఎత్తవలసియుండెను. ప్రజల దృష్టిని ఆకర్షించవలెనను ఉద్దేశముతో ఇశ్రాయేలులో బూరలు ఉపయోగింపబడినవి.

యెషయాకు అప్పగింపబడిన కార్యభారము, "వారు చేసిన తిరుగుబాటును నా జనులకు తెలియజేయుటయు, యాకోబు ఇంటివారికి వారి పాపములను తెలియజేయుటయునై" యుండెను. "యాకోబు ఇంటివారు" అను పదజాలము తొమ్మిది పర్యాయములు యెషయా గ్రంథంలోను[1], ఆరుసార్లు మాత్రమే ఇతర గ్రంథాల్లోను (రెండేసి పర్యాయములు ఆమోసు, మీకా, మరియు ఓబద్యాలో) కనబడును. ఇక్కడ "తిరుగుబాటు" అనగా, దేవుని చిత్తమును బాహాటముగా ధిక్కరించుట అని అర్థం. "పాపము" అనగా, దేవుని చేత ఆశింపబడిన ఆశయమునకు తక్కువగా నుండుట (రోమీయులకు 3:23 చూడుము). నిశ్చయముగా, ప్రవక్త తన పరిచర్యను విజయవంతంగా నెరవేర్చాడు.

ఆ తరువాత, "అయినను అనుదినము వారు నాయొద్ద విచారణ చేయుచు, నా మార్గములను తెలిసికొనన నిచ్ఛ కనుపరచుదురు" అని దేవుడు సెలవిచ్చాడు (వచనం 2). వారు తిరుగుబాటు చేయుచు పాపములో జీవించుచునే, వారు మతనిష్ఠగలవారై యున్నారని ప్రజలు *అనుకొనుచుండిరని* ఆశ్చర్యముగొలుపు ఈ ప్రకటన సూచించుచున్నది. జాన్ ఎన్. ఆస్వాల్ట్ ఈవిధంగా సెలవిచ్చుచున్నాడు, " '(ఉనికి కలిగియుండిన వాటన్నిటిలో నుండి) నా యొద్ద విచారణ చేయుదురు!' అను పదజాలము ఇక్కడి అబ్బురమైన ధోరణిని ఆకర్షించునదై యున్నది. వీరు వారి మతము విషయంలో చాలా గంభీరంగా మెలగువారై యున్నారు."[2] బాహ్యంగా అగుపించు పైరూపములన్నియు నిజముగా దైవభక్తిగలవారిని సూచిస్తాయి, కానీ వీరి విషయంలో ఇది వాస్తవము కాదు. వారి ఆరాధనలో దాగియుండిన కపటమును వారి జీవితాలే బాహాటంగా బయటపెట్టినవి. క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దము నాటి ప్రవక్తలందరు నిష్కాపట్య రహితమైన మతము యొక్క అనుచితమును సంబోధించారు.[3] "తమ దేవుని న్యాయవిధిని విడువక నీతని అనుసరించువారైనట్టు" ప్రజలు ప్రవర్తించుచుండిరని దేవుడు సెలవిచ్చాడు. "అనుసరించువారైనట్టు" అను పదమును "అనుసరించువారి వలె" అని కూడ అనువదింపవచ్చును. వారు ఒక నీతిమంతమైన ప్రజ "వలె" అగుపించారు, కానీ వాస్తవము బొత్తిగా మరొక విధంగా యుండింది.

"భక్తిపరులు" అయియున్నట్లు అగుపించిన వీరు దేవునికి వ్యతిరేకముగా వ్యక్తము చేసిన అసంతృప్తిని ప్రవక్త నమోదు చేసికొన్నాడు. "మేము ఉపవాసముండగా నీవెందుకు చూడవు? మేము మా ప్రాణములను ఆయాసపరచుకొనగా నీవెందుకు లక్ష్యపెట్టవు?" అని వారు ప్రశ్నించారు (వచనం 3ఎ). అయితే పాప ప్రాయశ్చిత్త దినాన చేయాల్సిన ఉపవాసము మాత్రమే దేవుడు ఆజ్ఞాపించిన ఉపవాసమై యున్నది.[4] ఏది ఏమైనా, ఉపవాసముండు

అభ్యాసమునుబట్టి మనుష్యులు దైవభక్తిగలవారుగా కనిపించారు గనుక ప్రజలు మత సంబంధమైన ఉపవాసదినముల సంఖ్యను హెచ్చించుకొన్నారు. యేసు జీవిస్తున్న దినాలలో చేయబడిన వేషధారణతో కూడిన ఉపవాసము గూర్చి ఆయన ఈ క్రింది విధంగా వ్యాఖ్యానించాడు.

> మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారులవలె దుఃఖముఖులై యుండకుడి; తాము ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యలకు కనబడవలెనని వారు తమ ముఖములను వికారము చేసికొందురు; వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను (మత్తయి 6:16).

"కలహపడుచు వివాదము చేయుచు అన్యాయముగా గుద్దులాడుచు" వారి హృదయాల్లో నెలకొని ఉండిన దుర్మార్గతను యేసు ప్రభువు బట్టబయలు చేసాడు (వచనం 4). వారు చాకచక్యంగా సంభాషించకపోయినట్లయితే దేవుడు వారిని ఆశీర్వదించడని వారు నేర్పరితనముతో వెదకుచుండిరి. అయితే దేవుడు వారి చర్యలను "చూసాడు" మరియు "గమనించాడు." వారి పనివారి పట్ల వారు వ్యవహరించుచుండిన తీరు దైవభక్తిగలవారికి విరుద్ధమైన విధంగా బహు కఠినమైనదై యుండినది (వచనం 3బి). అసలు సమస్య అది!

"అట్టి ఉపవాసము నాకనుకూలమా, మనుష్యుడు తన ప్రాణమును బాధపరచుకొనవలసిన దినము అట్టిదేనా?" అని దేవుడు అడిగాడు (వచనం 5). వారు ఉపవాసము చేయుచుండినప్పుడు బాహ్య పైరూపమును అధికంగా లక్ష్యపెట్టుచుండిరి: "ఒకడు తల వంచుకొని" మరియు వంచుట, "గోనెపట్ట కట్టుకొని, బూడిదె పరచుకొనుచుండిరి" వారు ఉపవాసమును ఒక ఆచారానుసరణకర్మగా అనగా తలలు వంచుట, గోనెపట్ట కట్టుకొనుట, బూడిదె పరచుకొనుట గా మార్చారు. ఈ చర్యలు విలాపమునకు లేక దుఃఖమునకు చిహ్నంగా ఉండినవి, కానీ ఉపవాసముండిన వారి హృదయాల్లోని వాస్తవమైన వైఖరిని అవి ప్రతిబింబించిచలేదు. (మీకా 6:6–8 చూడుము.)

### దేవుడేర్పరచిన ఉపవాసము మరియు దాని వలన కలుగు దీవెనలు (58:6–12)

> దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు
> కాడిమాను మోకాలు తీయుటయు
> బాధింపబడినవారిని విడిపించుటయు
> ప్రతి కాడిని విరుగగొట్టుటయు
> నే నేర్పరచుకొనిన ఉపవాసము గదా?
> నీ ఆహారము ఆకలిగొనినవారికి పెట్టుటయు నీ రక్త
>     సంబంధికి ముఖము తప్పింపకుండుటయు
> దిక్కుమాలిన బీదలను నీ యింట చేర్చుకొనుటయు
> వస్త్రహీనుడు నీకు కనబడినప్పుడు వానికి వస్త్రములిచ్చుటయు
> ఇదియే గదా నాకిష్టమైన ఉపవాసము?
> ఆలాగున నీవు చేసినయెడల నీ వెలుగు
>     వేకువ చుక్క వలె ఉదయించును
> స్వస్థత నీకు శీఘ్రముగా లభించును
> నీ నీతి నీ ముందర నడచును

యెహోవా మహిమ నీ సైన్యపు వెనుకటి భాగమును
కావలికాయును.
అప్పుడు నీవు పిలువగా యెహోవా ఉత్తర మిచ్చును
నీవు మొఱ్ఱపెట్టగా ఆయన – నేనున్నాననును.

"దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు కాడిమాను మోకాలు తీయుటయు బాధింపబడినవారిని విడిపించుటయు ప్రతి కాడిని విరుగగొట్టుటయు నే నేర్పరచుకొనిన ఉపవాసము గదా?" అని దేవుడడుగుచున్నాడు (వచనం 6). ఈ ప్రశ్నకు నిశ్చయాత్మకమైన జవాబు ఇవ్వబడవలసి యుండినది.[5] "బాధింపబడువారికి," "ఆకలిగొనువారికి," "దిక్కుమాలిన బీదలకు," మరియు "వస్త్రహీనులకు" సహాయము చేయుటకు ఆయనను ఆరాధించువారు తమ హృదయములను విప్పవలెనని దేవుడు ఎల్లప్పుడు ఆశిస్తున్నాడు (వచనాలు 6, 7). దేవుని యెడల తెరుచుకొనియున్న హృదయాలు తోటి మానవుల యెడల మూయబడియుండలేవు. (మత్తయి 25:32–46 చూడుము.) "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా: దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోకమాలిన్యము తనకంటకుండ తన్నుతాను కాపాడుకొనుటయునే" (యాకోబు 1:27).

8వ వచనం మొదలుకొని 12వ వచనము వరకు, మనుష్యుల మధ్య ఆయన చిత్తమును నెరవేర్చుటవలన కలుగు దీవెనలను దేవుడు వర్ణించియున్నాడు. పేర్కొనబడిన మొదటి దీవెనలు "వెలుగు" మరియు "యథాపూర్వస్థితికి వచ్చుట"యై యుండెను. "ఆలాగున నీవు చేసినయెడల నీ వెలుగు వేకువ చుక్క వలె ఉదయించును, స్వస్థత నీకు శీఘ్రముగా లభించును" అని ఆయన చెప్పెను (వచనం 8ఎ). మన వెలుగు "ప్రతి మనుష్యుని వెలిగించు" నిజమైన వెలుగు యొక్క ప్రతిబింబము మాత్రమే (యోహాను 1:9). మనము, ఇశ్రాయేలు వలెనే, దేవుడిచ్చుచున్న వాగ్దానము కలిగియున్నాము: "అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము, అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). ప్రతిబింబింపబడు ఈ వెలుగు మనము ఇతరులతో కలిగియుండు సంబంధములలో కనిపించును (1 యోహాను 2:9, 10). "స్వస్థత కలుగును" ఒక గాయము మానుటను సూచించుచున్నది. ప్రజలు దేవుని ధర్మశాస్త్రమునకు విరోధముగా తిరుగుబాటు చేయుటవలన వారికి గాయాలయ్యాయి. ఈ గాయములకు కలుగు స్వస్థత గూర్చి యెషయా చెప్పుచున్నాడు.

"నీ నీతి నీ ముందర నడచును; యెహోవా మహిమ నీ సైన్యపు వెనుకటి భాగమును కావలికాయును" అని చెప్పుచూ, దేవుడు తన వాగ్దానము చొప్పున కలుగనై యుండిన దీవెనను మరియు యథాపూర్వస్థితిని కొనసాగించాడు (వచనం 8బి). దేవుడు ఏర్పరచుకొనిన జనులకు, దైవికమైన కాపుదల నిర్గమ సమయములో ఉండినట్లు వారికి ముందును, వారి వెనుకను ఉండును (నిర్గమకాండము 14:19, 20).

ఇతరులను బాధించుటయు
వ్రేలుపెట్టి చూపి తిరస్కరించుటయు

చెడ్డదానినిబట్టి మాటలాడుటయు నీవు మాని
ఆశించినదానిని ఆకలిగొనినవానికిచ్చి శ్రమపడినవానిని
తృప్తిపరచినయెడల
చీకటిలో నీ వెలుగు ప్రకాశించును
అంధకారము నీకు మధ్యాహ్నమువలె నుండును.
యెహోవా నిన్ను నిత్యము నడిపించును
క్షామకాలమున ఆయన నిన్ను తృప్తిపరచి నీ యెముకలను
బలపరచును
నీవు నీరు కట్టిన తోటవలెను
ఎప్పుడును ఉబుకుచుండు నీటి ఊటవలెను ఉండెదవు.
పూర్వకాలమునుండి పాడైపోయిన స్థలములను నీ
జనులు కట్టెదరు
అనేకతరముల క్రిందట పాడైపోయిన పునాదులను
నీవు మరల కట్టెదవు
విరుగబడినదానిని బాగుచేయువాడవనియు
దేశములో నివసించునట్లుగా త్రోవలు సిద్ధపరచువాడ వనియు
నీకు పేరు పెట్టబడును.

9బి మొదలుకొని 12 వచనములు దేవుని యెడల నీతిమంతులై యుండువారికి కలుగు దీవెనల చర్చను పొడిగించుచున్నవి. షరతులతో కూడిన ఉపవాక్యముల పరంపర ఈ అధ్యాయంలో కనబడును, వాటిలో కొన్ని “అయితే” అనియు, “అప్పుడు” అనియు వ్రాయబడియున్నవి. 6 నుండి 8వ వచనము వరకు, “అయితే” అను ఉపవాక్యము లేదు; కానీ 7–8 వచనములలో, బీదలపై ఒకరు కలిగియుండు కనికరమునకు ఫలితంగా కలుగు దీవెనలు గూర్చి “ఆలాగున నీవు చేసినయెడల” అని వ్రాయబడుటనుబట్టి అది అంతర్భాగమై యున్నదని సూచించుచున్నది. ప్రజలు చేసేప్రార్థనలకు దేవుడు జవాబిస్తాడు మరియు వారితో కూడ ఉంటాడు, కానీ ఒక షరతుపై: “ఇతరులను బాధించుటయు, వ్రేలుపెట్టి చూపి తిరస్కరించుటయు, చెడ్డ దానినిబట్టి మాటలాడుటయు నీవు మానినట్లయితే” (వచనం 9బి). “వ్రేలుపెట్టి చూపి తిరస్కరించుట” అని ప్రస్తావింపబడిన బైబిలులోని ఒకే ఒక ఇతర సందర్భములో, వాని హృదయములో విపరీత బుద్ధిగల దుష్టుని చేత చేయబడునని తెలియుచున్నది (సామెతలు 6:12–15). ఒకరు దీవింపబడవలెనంటె, ఇటువంటి అవినీతికరమైన ప్రవర్తన అగిపోవలసినదే. షరతులతోకూడిన ఆలోచన 10వ వచనంలో కొనసాగుచున్నది: “ఆశించినదానిని ఆకలిగొనినవానికిచ్చి శ్రమపడినవానిని తృప్తిపరచినయెడల, చీకటిలో నీ వెలుగు ప్రకాశించును ...” వారు ఇతరులకు చేయుసేవ వారు ప్రకాశించునట్లు చేయును. “ఆకలిగొనువారు” మరియు “శ్రమపడువారు” “విలువనిచ్చుటకును మరియు గౌరవించుటకును యోగ్యులైనవారైయున్న దేవుని యందలి సహోదర సహోదరీమణులై యున్నారని” ఎంచబడవలెను.[6]

ఇక్కడ, ఓదార్పు సంబంధమైన చర్చనీయాంశం కనబడుచున్నది. ఆయన వారికి తన మార్గదర్శకమును యిచ్చునని దేవుడు తన ప్రజలకు అభయమిచ్చాడు మరియు ఆయన వారికి ఆహారమును మరియు నీళ్ళను సమకూర్చునని సెలవిచ్చాడు. గనుక వారు “నీరు కట్టిన తోటవలెను, ఎప్పుడును ఉబుకుచుండు నీటి ఊటవలెను” ఉందురు (వచనం 11).

బబులోనీయుల ద్వారా నాశనము చేయబడినది పునఃనిర్మింపబడవలెనంటే ప్రజలందరు దేవుని మెప్పును పొందుకొనుచున్నవారై యుండాలి (వచనం 12). ఇదొక అక్షరార్థమును ప్రతీకాత్మకమునైన వాగ్దానమై యున్నది. వారి పట్టణములు పునఃనిర్మింపబడు రీతినే, దేవుని పట్టణము కూడ పునఃనిర్మింపబడుతుంది మరియు విశ్వసనీయులైనవారు అందులో నివసిస్తారు.

## సబ్బాతు దినమును ఆచరించుట (58:13, 14)

నా విశ్రాంతిదినమున వ్యాపారము చేయకుండ
నాకు ప్రతిష్ఠితమైన దినమని నీవు ఊరకుండినయెడల
విశ్రాంతిదినము మనోహరమైనదనియు
యెహోవాకు ప్రతిష్ఠితదినమనియు ఘనమైనదనియు
అనుకొని దాని ఘనముగా ఆచరించినయెడల
నీకిష్టమైన పనులు చేయకయు వ్యాపారము చేయకయు
లోకవార్తలు చెప్పుకొనకయు ఉండినయెడల
నీవు యెహోవాయందు ఆనందించెదవు
దేశముయొక్క ఉన్నతస్థలములమీద నేను నిన్నెక్కించెదను
నీ తండ్రియైన యాకోబు స్వాస్థ్యమును నీ యనుభవములో ఉంచెదను
యెహోవా సెలవిచ్చిన వాక్కు ఇదే.

సబ్బాతు దినమందు ప్రజలు విందులారగించుచు విశ్రాంతినొందుచుండు సమయమై యుండవలెనని దేవుడు దానిని నియమించాడు. అది దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించిన దినముగా కూడ జ్ఞాపకము చేసికొనాల్సిన దినమై యుండినది (నిర్గమకాండము 31:15; లేవీయకాండము 16:31; ద్వితీయోపదేశకాండము 5:15 చూడుము). మతసంబంధమైన ఆచారానుసరణమును 13వ వచనము దాని సరైన దృష్టికోణంలో ఉంచుచున్నది. మనము మనకిష్టమైన పనులు చేయకయు, మన సొంత ఆహ్లాదమును వెదకకయు, లోకవార్తలు చెప్పుకొనకయు ఉండుట ద్వారా దేవున్ని గౌరవించాల్సినవారమై యున్నాము.

ఈ ప్రమాణములకు తగినట్లుగా ప్రవర్తించినట్లయితే, “నీవు యెహోవాయందు ఆనందించెదవు” అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 14). మన కృతజ్ఞతా స్తుతులకు దేవుడే కేంద్రమై యుండాలి, ఏలయనగా ఆయనే మన దీవెనలకు మూలాధారమై యున్నాడు. ద్వితీయోపదేశకాండము 32:9-14లో వ్రాయబడియున్నట్లుగా దేవుడు వారి యెడల చూపించుచుండిన శ్రద్ధను యెషయా వారికి గుర్తుచేయుచున్నాడు:

యెహోవా వంతు ఆయన జనమే
ఆయన స్వాస్థ్యభాగము యాకోబే.
అరణ్య ప్రదేశములోను
భీకరధ్వనిగల పాడైన యెడారిలోను
వాని కనుగొని అవరించి పరామర్శించి తన కనుపాపను
 వలె వాని కాపాడెను.
పక్షిరాజు తన గూడు రేపి తన పిల్లలపైని అల్లాడుచు

రెక్కలు చాపుకొని వాటిని పట్టుకొని తన రెక్కల
    మీద వాటిని మోయునట్లు
యెహోవా వానిని నడిపించెను.
యెహోవా మాత్రము వాని నడిపించెను
అన్యులయొక్క దేవుళ్లలో ఏ దేవుడును ఆయనతో
    కూడ ఉండలేదు.
భూమియొక్క ఉన్నతస్థలములమీద వాని
    నెక్కిచెను
పొలముల పంట వానికి తినిపించెను.

58:14లో వ్రాయబడియున్న - "దేశము యొక్క ఉన్నత స్థలముల మీద నేను నిన్నెక్కించెదను" మరియు "నీ తండ్రియైన యాకోబు స్వాస్థ్యమును నీయనుభవములో ఉంచెదను" అను రెండు పదజాలములు పాత నిబంధనలో మరెక్కడను కానరావు. అవి దేవుడు తన ప్రజల పట్ల చూపించు శ్రద్ధను సూచించుచున్నవై యున్నవి.

---

సూచనలు

[1]యెషయా 2:5, 6; 8:17; 10:20; 14:1; 29:22; 46:3; 48:1; 58:1. [2]John N. Oswalt, *The Book of Isaiah, Chapters 40-66,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 496. [3]హోషేయ 4:1-14; ఆమోసు 2:4-8; మీకా 3:1-12 చూడుము. [4]పాప ప్రాయశ్చిత్త దినమునకైన అధికారమును దేవుడిచ్చిన విషయాన్ని మనము లేవీయకాండము 23:26-32లో చూడగలము. ఈ సందర్భమును లూకా "ఉపవాస దినము" అని ప్రస్తావించాడు (అపొస్తలుల కార్యములు 27:9). [5]Edward J. Young, *The Book of Isaiah,* vol. 3, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 419. [6]Oswalt, 505.

---

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

### ❖❖❖ నిజమైన ఆధ్యాత్మికత ❖❖❖

**(అధాయము 58)**

ఈ అధ్యాయం యొక్క చర్చనీయాంశం ఉపవాసమై యున్నది. ప్రజలు దేవుని గూర్చి, నిశ్చయమైనవారై యుండవలెనని ఆందోళన చెందుచుండిరి. దేవుడు వారిని అభినందిస్తున్న ప్రవృత్తితో ఈ విధంగా ప్రకటించాడు, "తమ దేవుని న్యాయవిధిని విడువక నీతిని అనుసరించువారైనట్టు అనుదినము వారు నాయొద్ద విచారణచేయుచు, నా మార్గములను తెలిసికొన నిచ్ఛ కనుపరచుదురు. తమకు న్యాయమైన తీర్పులు తీర్చవలెనని వారడుగుదురు, దేవుడు తమకు ప్రత్యక్షుడు కావలెనని యిచ్ఛయించుదురు" (వచనం 2). వారు దాదాపుగా ప్రతి విషయంలో ఉన్నత స్థాయిలో ఉండిరి: దేవుని వెదకుట, ఆయనయందు ఆనందించుట, ఆయనకు మొరపెట్టుట, ఆయనకు లోబడుట మొ. ఇంత చేసినప్పటికిని, ఏదో ఒకటి కొరతగా ఉండినది. "మేము ఉపవాసముండగా నీవెందుకు చూడవు? మేము మా ప్రాణములను అయాసపరచుకొనగా నీవెందుకు లక్ష్యపెట్టవు?" అని వారు దేవుని

ప్రశ్నించారు. నెలకొని యుండిన తప్పేమిటి? యథార్థమైన నిజమైన యొక్క సారమును ఈ అధ్యాయం సూచించుచున్నది.

*వారి సొంత ప్రయోజనాల దృష్ట్యా వారు ఉపవాసము చేయుచుండిరి, దేవుని విషయంలో కాదు.* "ఇదిగో, మీరు కలహపడుచు వివాదము చేయుచు అన్యాయముగా గుద్దులాడుచు ఉపవాసముందురు. మీ కంఠధ్వని పరమున వినబడునట్లుగా మీరిప్పుడు ఉపవాసముండరు" అని యెషయా చెప్పుచున్నాడు (వచనం 4). అలాంటప్పుడు, వారి చర్యలు, నిజమైన ఆధ్యాత్మికత గూర్చిన వాస్తవములను మనముందుంచుచున్నవి: దేవుని ఉద్దేశములను వెదకుచు వాటి నిమిత్తము ఒకరు తనను తాను నష్టపరచుకొనవలెను.

*వారు గర్వమునుబట్టి ఉపవాసము చేయుచుండిరి, వినయమునుబట్టి కాదు.* "అట్టి ఉపవాసము నాకనుకూలమా? మనుష్యుడు తన ప్రాణమును బాధపరచుకొనవలసిన దినము అట్టిదేనా?" అని దేవుడు అడుగుచున్నాడు (వచనం 5). "మేము బూడిదెలోను ధూళిలోను ఉపవాసముంటిమి!" అని ప్రజలు చెప్పుచుండిరి. ఏదిఏమైనా, వారు చేపట్టిన చర్యల గూర్చి వారు గర్వించుచుండిరి! ఉపవాసముండుట వారికి పరిశుద్ధ చిహ్నమయ్యింది. వారి మనవులతో ఆయన యొద్దకు వచ్చువారు, ఆయన చిత్తమును తెలిసికొని, దానిని వర్ధిల్లజేసుకొన దలచుచు, దాని అద్భుతములో తనను తాను పోగొట్టుకొని దానిని ఆస్వాదించుకొననిష్టపడువారు, వినయముతో రావలెనని దేవుడు కోరుచున్నాడు. మనము ఆయన చిత్తమును వెదకునప్పుడు మనలను మనము సంపూర్తిగా ఆయన అనురాగమునకును సదుద్దేశ సంకల్పములకును వశపర్చుకొని వెదకవలెనని ఆయన కోరుచున్నాడు.

*వారు స్వార్థముతో ఉపవాసము చేయుచుండిరి, నిస్వార్థముతో కాదు.* ఉపవాసము నుండి ఉద్భవించునది బీదలు, అవసరములో ఉన్నవారు, మరియు నిరాశ్రయుల గూర్చిన దైవికమైన చింతయై యుండవలెను (వచనయి 7). నిజమైన ఆధ్యాత్మికత వెలుపలి అభివ్యక్తమును కలిగియుండుట మాత్రమేగాక, దేవుని శక్తిసామర్థ్యాల సద్వినియోగము నిమిత్తము ద్వారాలను కూడా తెరుస్తుంది. కరుణతో వారి కార్యములను చేయువారికి దేవుడు ఇలా వాగ్దానము చేయుచున్నాడు, "అప్పుడు చీకటిలో నీ వెలుగు ప్రకాశించును, అంధకారము నీకు మధ్యాహ్నమువలె నుండును. యెహోవా నిన్ను నిత్యము నడిపించును ... . నీవు నీరు కట్టిన తోటవలెను, ఎప్పుడును ఉబుకుచుండు నీటి ఊటవలెను ఉండెదవు" (వచనాలు 10బి, 11).

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

### ❖❖❖ ఉపవాసమును గూర్చిన ప్రశ్న ❖❖❖
### (మత్తయి 9:14-17)

మత్తయి 9వ అధ్యాయంలో ఉపవాసమునకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన ప్రశ్న మనకు కనబడుచున్నది: "అప్పుడు యోహాను శిష్యులు ఆయన యొద్దకు వచ్చి, 'పరిసయ్యులును, మేమును తరుచుగా ఉపవాసము చేయుచున్నాము గాని నీ శిష్యులు

ఉపవాసము చేయరు, దీనికి హేతువేమి?' " (వచనం 14). ఉపవాసముండుట పరిసయ్యులకు అదొక వాడుకయై యున్నది, గనుక బాప్తిస్మమిచ్చు యోహానును వెంబడించుచుండిన వీరు, యేసును వెంబడించువారు ఈ సాంప్రదాయాన్ని ఎందుకు పాటించుటలేదో తెలిసికొనవలెనని ఆశించారు.

*Didache* అని పిలువబడు ఆదిమ క్రైస్తవ దస్తావేజులలో భిన్నమైన వాడుక ఒకటి వ్రాయబడియున్నది. ఈ దస్తావేజు, సుమారు క్రీ.శ. 120వ స॥లో వ్రాయబడినది, పన్నెండు మంది అపొస్తలులు చేసిన బోధలు కలిగియున్నది. "మీరు సోమవారం మరియు గురువారం నాడు, అనగా వేషధారులు ఉపవాసముండు దినములలో, ఉపవాసముండకూడదు, కానీ బుధవారం మరియు శుక్రవారాల్లో ఉపవాసముండవలెను" అని అందులో వ్రాయబడి యున్నది. రచయిత పరిసయ్యులను వేషధారులనుగా ప్రస్తావించుచుండెను. యేసు కాలము నాటికి, వారు వారమునకు రెండు పర్యాయాలు ఉపవాసముండినట్లు స్పష్టమగుచున్నది (లూకా 18:11, 12 చూడుము).

పాత నిబంధన, మోషే ధర్మశాస్త్రము, సంవత్సరమంతటిలో ఒకే ఒక్క రోజున ఉపవాసము చేయవలెనని చెప్పినది. ఆ దినమే పాప ప్రాయశ్చిత్త దినమై యుండినది, ఈ దినము *Yom Kippur,* అని కూడ పిలువబడింది, ఈ దినము దాదాపుగా అక్టోబర్ మొదటి తేదీన వస్తుంది. యూదులు పస్కా, పెంతెకొస్తు, గుడారముల పండుగ, మరియు బూరల పండుగను ఆచరిస్తారు. ఇవన్నీ విందులారగించాల్సిన రోజులు – కానీ పాప ప్రాయశ్చిత్త దినాన, వారు ఉపవాసముంటారు.

ఉపవాసముండుట గూర్చి ఆయనను అడిగిన ప్రశ్నకు యేసు ఈ విధంగా జవాబిచ్చాడు: "పెండ్లి కుమారుడు తమతో కూడ నుండు కాలమున పెండ్లి యింటివారు దుఃఖపడగలరా? పెండ్లి కుమారుడు వారియొద్దనుండి కొనిపోబడు దినములు వచ్చును, అప్పుడు వారు ఉపవాసము చేతురు" (మత్తయి 9:15). ఈ సామ్యము గ్రహించుటకు సులభముగా నున్నది; యేసు పెండ్లికుమారుడై యున్నాడు. "నేను ఇక్కడ ఉన్నంత కాలము," "ఇది సంతోషపడుచూ ఆనందించవలసిన సమయమై యున్నది, గనుక ఉపవాసముండవలసిన సమయము కాదు" అని ఆయన చెప్పుచుండెను. పెండ్లి యింటవారు, సహజంగానే, యేసు శిష్యులను సూచించుచున్నారు. "పెండ్ల కుమారుడు వారి యొద్ద నుండి కొనిపోబడినప్పుడు" అను మాటలు యేసు సిలువవేయబడుటను లేదా ఆయన ఆరోహణమగుటను అనగా, వారి మధ్య యిక ఏమాత్రమును ఉండని పరిస్థితిని సూచింపవచ్చును. "కష్టకాలములు ఎదురౌతాయి, అప్పుడు మీరు ఉపవాసముందరు" అని ఆయన భావించాడు.

ఇదే సందర్భంలో, మనము క్రొత్త విషయాలతో పాత విషయాలను మిళితము చేయకూడదని బోధించుటకై యేసు రెండు వివరణాత్మకమై దృష్టాంతములను ఉపయోగించాడు (మత్తయి 9:16, 17). మనము పాత నియమమును క్రొత్త నియమముతో మేళవించలేము. ఉపవాసముండుట మోషే ధర్మశాస్త్రములోని భాగమై యుండెను. పాత నియమానుసారమైన ఉపవాసమును పాటించుటకు ఈనాడు మనము బద్ధులము కాము.